క్లుప్తంగా

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ నాయకులు



కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని మద్దిగట్లకు చెందిన 30మంది బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరుతున్న వారికి చిన్నారెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి వివిధ పార్టీలకు చెందిన వారు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఆగస్టు 15లోపు రైతులకు రూ.2లక్షల రుణమాఫీ ఏకకాలంలో చేసి తీరుతామన్నారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయాలని, పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి ఎల్లప్పుడు గుర్తింపు ఉంటుందన్నారు.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం



పెబ్బేరు రూరల్: మండలంలోని రంగాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను హెచ్ఎం జయరాములు, ఉపాధ్యాయులతో కలిసి సన్మానించారు. శ్రీరంగాపురం మండలంలోని కంభాళాపురం ప్రాథమిక పాఠశాలలో పనిచేసిన ముగ్గురు ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లగా.. వారిని గ్రామస్తులు, ఉపాధ్యాయులు శాలువా, పూలమాలతో సన్మానించారు. కాంప్లెక్ హెచ్ఎం విష్ణువర్ధన్‌రెడ్డి, హెచ్ఎం వెంకటేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం ప్రదీప్, రవి, నరేష్, శివశంకర్, గ్రామస్తులు బీరం రాజశేఖర్ రెడ్డి, ఈశ్వరయ్య, ఆంజనేయులు, రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపిక



ఆత్మకూర్: ఆత్మకూర్‌లోని విశ్వభారతి హైస్కూల్ విద్యార్థి మహమ్మద్‌సల్మాన్ హైదరాబాద్‌లోని హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో ఐదో తరగతిలో సీటు సాధించినట్లు పాఠశాల నిర్వాహకులు బాలరాజు, చంద్రయ్య తెలిపారు. జిల్లాస్థాయి ప్రవేశ పరీక్షలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి సీటు సాధించిన సల్మాన్‌ను శనివారం పాఠశాల యాజమాన్యం అభినందించారు. కార్యక్రమంలో రఫీక్, అంబేడ్కర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



పాన్‌గల్: మండలంలోని చింతకుంట, కొత్తపేట, దావాత్‌ఖాన్‌పల్లి, చిక్కేపల్లి గ్రామాల్లో శనివారం కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి పర్యటించి బాధిత కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. చింతకుంటలో శస్త్ర చికిత్స చేయించుకున్న ఆంజనేయులు, కొత్తపేటలో ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన మాజీ సర్పంచ్ రమేష్ కుటుంబాన్ని, దావాత్‌ఖాన్‌పల్లిలో మాజీ సర్పంచ్ నాగేష్‌నాయుడు నాయనమ్మ నాగమ్మ అనారోగ్యంతో మృతిచెందడంతో బాధిత కుటుంబ సభ్యులను, చిక్కేపల్లిలో మాజీ వార్డు సభ్యుడు బోయ కృష్ణయ్య ఇటీవల గుండెపోటుతో మృతిచెందడంతో కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే వెంట వెంకటయ్య నాయుడు, గోపాల్‌రెడ్డి, బాలస్వామి, శివారెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, బాలస్వామియాదవ్, భాస్కర్ రెడ్డి, తిలకేశ్వర్‌గౌడ్, నర్సింహ, ప్రవీణ్‌కుమార్ రెడ్డి, నవీన్‌రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వర్గీకరణలో ఎమ్మార్పీఎస్‌ది కీలక పాత్ర

అలంపూర్: ఎస్సీ వర్గీకరణ సాధనలో ఎమ్మార్పీఎస్‌ది కీలక పాత్ర అని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. కర్నూల్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో ఎమ్మార్పీఎస్ దీక్ష కరపత్రాలను శనివారం ఎమ్మెల్యే విడదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. గతంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడంతో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ సారైన ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు. వర్గీకరణ సాధనలో ఎమ్మార్పీఎస్ 30 ఏళ్లుగా ఉద్యమిస్తోందన్నారు. ఎంతో మంది ప్రాణ త్యాగాలు చేశారన్నారు. టీఎస్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించి 30 ఏళ్లు కావస్తున్న సందర్భంలో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెవడానికి ఆదివారం రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు.

సమస్యల వలయంలో ‘వసతి గృహాలు’



ఆత్మకూర్‌లోని ఎస్సీ బాలుర హాస్టల్లో మధ్యలోనే నిలిచిన డైనింగ్‌హాల్



ఆత్మకూర్‌లోని ఎస్సీబాలుర హాస్టల్‌లో నిలిచిన బాత్‌రూంల నిర్మాణం

సాక్షి విజిట్

ఆత్మకూర్: పట్టణంలోని ఎస్సీ బాలుర వసతిగృహంలో 138 మంది విద్యార్థులు చదువుతుండగా.. వారికి అవసరమైన బాత్‌రూంలు నిర్మించాలని 2014లో రూ.5లక్షల నిధులతో 11 బాత్‌రూంల నిర్మాణాలు చేపట్టారు. సగం పనులు చేసిన కాంట్రాక్టర్ బిల్లులు అందిన వెంటనే పనులను మధ్యలోనే వదిలేసి వెళ్లిపోయాడు. డైనింగ్ హాల్ నిర్మాణాన్ని 2014లో చేపట్టి మధ్యలోనే వదిలేశారు. ఎస్సీ బాలికల వసతిగృహంలో 125 మంది విద్యార్థినులు చదువుతున్నారు. కంపౌండ్ వాల్, డ్రైయినేజీ సమస్యలున్నట్లు విద్యార్థులు తెలిపారు. అలాగే బీసీ బాలురు హాస్టల్‌లో 130 మంది విద్యార్థులు ఉండగా.. ప్రైవేటు భవనంలో కొనసాగుతుంది. బీసీ కాలేజీ హాస్టల్‌లో 21 మంది విద్యార్థులు ఉండగా ప్రైవేట్ భవనంలో కొనసాగుతుంది.

మదనాపురం: స్థానిక ఎస్సీ హాస్టల్‌లో 98 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రస్తుతం హాస్టల్‌లో ఎలాంటి ఇబ్బందులు లేవని విద్యార్థులు తెలిపారు.

కొత్తకోట రూరల్: కొత్తకోట పట్టణ శివారులో గల ఎస్సీ బాలుర వసతి గృహంలో 138మంది విద్యార్థులు ఉన్నారు. వసతి గృహం సొంత భవనంలో కొనసాగుతుండగా.. ఆవరణలో పచ్చటి చెట్లు ఆకర్షణగా ఉన్నాయి. విద్యార్థులకు సరిపడా బాత్‌రూంలు ఉన్నాయి.

పెద్దమందడిలో..

పెద్దమందడిలోని ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలలో 100మంది దాకా విద్యార్థినులు ఉన్నారు. సొంత భవనంలో హాస్టల్ ఉంటే బాగుంటుందని విద్యార్థులు తెలిపారు.

షెడ్లే దిక్కు

గోపాల్‌పేట: మండల కేంద్రంలోని బీసీ హాస్టల్ వసతి గృహంలో సమస్యలు తాండవిస్తున్నాయి. హాస్టల్‌లో 80 మంది విద్యార్థులు చదువుతుండగా.. సొంత భవనం లేకపోవడంతో ఏళ్లుగా ప్రైవేటు ఇళ్లు, ఇతర షెడ్లలో కొనసాగుతోంది. నాలుగేళ్లుగా ఓ షెడ్డులో కొనసాగుతున్న బీసీ హాస్టల్‌కు కిటికీలు, మరుగుదొడ్లు, తలుపులు ఏవీ లేవు. రేకుల షెడ్డులో కేవలం గోడలు కట్టి అలాగే వదిలేయడంతో విద్యార్థులు రాత్రి సమయాల్లో తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. వార్డెన్‌ను వివరణ కోరగా.. సొంత భవనం నిర్మాణానికి రెండేళ్ల క్రితమే టెండర్లు వేసినా.. కాంట్రాక్టర్లు ముందుకు రాలేదని చెప్పారు. ఎస్సీ సంక్షేమ వసతి గృహంలో మొత్తం 120 మంది విద్యార్థులు ఉన్నారు.



గోపాల్‌పేట ఎస్సీ హాస్టల్‌లో ఇరుకుగా ఏర్పాటు చేసిన బెడ్లు



పాన్‌గల్ హాస్టల్‌కు ప్రహరీ నిర్మించాల్సిన ప్రాంతం

ప్రహరీ నిర్మించండి

పాన్‌గల్: మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర హాస్టల్ భవనం వెనుక భాగంలో వ్యవసాయ పొలాలు ఉండగాఒక పక్క ప్రహరీ లేకపోవడంతో ఇబ్బందిగా మారింది. దీంతో పాటు భవనానికి సమీపంలో కేఎల్ఐ కాల్వ, గట్టు ఉండటం, వ్యవసాయ పొలాలతో దోమల ప్రభావం అధికంగా ఉందని విద్యార్థులు తెలిపారు. 70 మంది విద్యార్థులు ఉండగా.. మరుగుదొడ్లు, తాగునీటి వసతి, గదుల వంటి వసతులు బాగానే ఉన్నాయని విద్యార్థులు పేర్కొన్నారు.

మరుగుదొడ్ల కొరత



అమరచింత హాస్టల్‌లో విద్యార్థులు ఉపయోగిస్తున్న మరుగుదొడ్లు

అమరచింత: మండల కేంద్రంలోని ఎస్సీ వసతి గృహం చుట్టూ కంపౌండ్ వాల్ లేని కారణంగా విద్యార్థులకు రాత్రి వేళ రక్షణ కరువైంది. సొంత భవనం ఉన్నా చుట్టు కంపౌండ్ వాల్ నిర్మాణం కాలేదు. సగ భాగం వరకు కంపౌండ్ వాల్ నిర్మించిన అధికారులు పూర్తిస్థాయిలో కంపౌండ్ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాల్సి ఉంది. వసతి గృహంలో మొత్తంగా 115 మంది విద్యార్థులు మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుకుంటున్నారు. ప్రస్తుతం ఎనిమిది మరుగుదొడ్లు ఉండగా.. మరో ఐదు మరుగుదొడ్లు అవసరమని విద్యార్థులు తెలిపారు. వసతి గృహం చుట్టు సీసీ కెమెరాలు ఉన్నాయి.

ప్రమాదకరంగా గుంత

చిన్నంబావి: మండలంలోని కొప్పునూరు ప్రభుత్వ ఎస్సీ హాస్టల్‌లో 50మంది విద్యార్థులు ఉన్నారు. వసతి గృహం ఆవరణలో ప్రమాదకరంగా గుంత ఉంది. అదే విధంగా పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలు పెరగడంతో విష సర్పాలు వచ్చే ప్రమాదం ఉందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



కొప్పునూరు ఎస్సీ ప్రభుత్వ వసతి గృహం ఆవరణలో ప్రమాదకరంగా గుంత

బీజేపీ బలోపేతానికి కృషి



వనపర్తి: కేంద్రం హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ని శనివారం జెడ్పీ మాజీ చైర్మన్ ఆర్.లోక్‌నాథ్‌రెడ్డి, సర్పంచుల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి హైదరాబాద్‌లో కలిశారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి సహకారం అందించాలని వారు కోరారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించి రాష్ట్రంలో నూతన అధ్యక్షుడి నియామకం తర్వాత ప్రణాళికతో పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కేంద్ర మంత్రిని వారు శాలువా, పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. కార్యక్రమంలో సబ్బిరెడ్డి వెంకట్‌రెడ్డి, అంజి తదితరులు ఉన్నారు.

దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతు చేయాలి



పాన్‌గల్: మండలంలోని రోడ్లతో పాటు వీపనగండ్ల మండలాల్లో దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతు చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీరామ్, గోపాలకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ప్రధాన కార్యాలయాలకు వెళ్లే రోడ్డును, వెంగళాయిపల్లి, కేతేపల్లి, వీపనగండ్ల మండలంలోని బొల్లారం గ్రామాల రోడ్లను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రంలో ప్రధాన రోడ్డు ఆర్ అండ్‌బీ రోడ్డు నుంచి ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే రోడ్డు గుంతలు పడి అధ్వాన్నంగా తయారైందన్నారు. సంబంధిత అధికారులు స్పందించి దెబ్బతిన్న రోడ్లకు వెంటనే మరమ్మతు చేపట్టాలని, లేనిచో సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో కుర్మయ్య, సహదేవ్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

కొత్తకోట రూరల్: బాబు జగ్జీవన్‌రామ్ 38వ వర్ధంతిని కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక చౌరస్తాలో గల బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి వివిధ పార్టీలకు చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ సామాజిక న్యాయ సాధనకు కృషి చేసిన బాబు జగ్జీవన్‌రామ్ ఆశయాలను, ఆలోచన విధానాలకు అనుగుణంగా నేటి సమాజం అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. ఉప ప్రధానిగా, కేంద్ర మంత్రి వర్గంలో వివిధ శాఖలకు ప్రాతినిధ్యం వహిస్తూ ఆ పదవులకే వన్నె తెచ్చిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో టీపీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు ప్రశాంత్, ఎన్‌జే బోయేజ్, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ పీజే బాబు, గాడీల ప్రశాంత్, మిషేక్, మాసన్న, వెంకటేశ్వర్‌రెడ్డి, సుభాష్, రాములుయాదవ్, ఇజ్రాయిల్ తదితరులు ఉన్నారు.



కొత్తకోటలో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

రిజర్వేషన్ ఫలాలు జగ్జీవన్‌రామ్ పుణ్యమే

వనపర్తిటౌన్: రాజ్యాంగం పదేళ్లకే బడుగు, బలహీన వర్గాలకు రిజర్వేషన్లను పరిమితం చేస్తే వాటి ఫలాలను శాశ్వతంగా అందుతున్నాయంటే అందుకు బాబు జగ్జీవన్‌రామ్ కారణమని ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి టీజేఏసీ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కవులు గిరిరాజాచారి, డాక్టర్ నాయకంటి నరసింహాశర్మ, నాయకులు గంధం నాగరాజు, దేవన్ననాయుడు, బాలేమియా, గంధం శరవంద తదితరులు పాల్గొన్నారు.



వనపర్తిలో..

ఆత్మకూర్: స్థానిక బస్టాండ్‌చౌక్‌లో బాబుజగ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా చైర్‌పర్సన్ గాయత్రి మాట్లాడుతూ బాబు జగ్జీవన్‌రాం నిరుపేద ప్రజల అభ్యున్నతి కోసం ఎంతో కృషి చేశారన్నారు.

రైతు సంక్షేమం కోసం రాజీలేని పోరాటం

అమరచింత: రైతుల సంక్షేమం కోసం దేశవ్యాప్తంగా రైతులకు అండగ ఉంటూ పోరాటం చేస్తున్న ఏకైక సంఘం ఏఐకేఎస్ అని ఆసంఘం జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేష్ అన్నారు. ఏఐకేఎస్ రాజకీయ శిక్షణ తరగతులు ఈనెల 7న జిల్లాలోని నాగవరం తండాలో నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. మండలంలోని పాంరెడ్డిపల్లిలో రైతులను కలిసి వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షల రుణమాఫీ, రైతు భరోసా, సబ్సిడీ విత్తనాలు, ఎరువులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం రైతు సమస్యలను విస్మరించిందని, వ్యవసాయం దండగ అనే స్థాయిని తీసుకొచ్చిందని దుయ్యబట్టారు. వ్యవసాయ రంగంను కార్పోరేట్ శక్తులకు అప్పగించేందుకు కుట్రలు పన్నుతుందన్నారు. జిల్లాస్థాయిలో నిర్వహించే ఏఐకేఎస్ రాజకీయ శిక్షణ తరగతులకు ముఖ్య వక్తలుగా రాష్ట్ర కార్యదర్శి టి.సాగర్, రాష్ట్ర నాయకుడు జబ్బార్ హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో మోహన్, నాగరాజు, అనిల్, శంకర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సన్మానం

వనపర్తిటౌన్: మున్సిపల్ వైస్ చైర్మన్‌గా, పీసీసీ సభ్యుడిగా కాంగ్రెస్ పార్టీకి సేవ చేసిన సీనియర్ నాయకుడు శ్రీనివాస్‌గౌడ్ కార్యకర్తలకు, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటాడని అఖిలపక్ష ఐక్య వేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్, మాజీ ఎంపీపీ శంకర్‌నాయక్ అన్నారు. ఈ మేరకు శ్రీనివాస్‌గౌడ్ నూతన మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎన్నిక కావడంతో శనివారం కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు ఆయనను పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఇది వరకే మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పనిచేసి రైతుల అభ్యున్నతికి కృషిచేసిన శ్రీనివాస్‌గౌడ్ మళ్లీ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి వరించడం హర్షనీయమన్నారు. తనకొచ్చిన పదవితో ప్రజలకు, రైతులకు మరింత సేవ చేయాలని, ప్రజా సేవ చేసే ఆయన భవిష్యత్తులో మరింత ఉన్న స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ యూత్ రాష్ట్ర అధికార ప్రతినిధి విష్ణువర్ధన్‌రెడ్డి, కౌన్సిలర్ బ్రహ్మం, జిల్లా యువత ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ పాండుసాగర్, శ్రీరంగాపురం కాంగ్రెస్ యువజన అధ్యక్షుడు చిన్నాగౌడ్, పాతకోట రాజు తదితరులు పాల్గొన్నారు.



శ్రీనివాస్‌గౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

అక్రమంగా ఇసుక, మట్టి తరలింపు



కానాయపల్లి శంకరసముద్రం నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్

కొత్తకోట రూరల్: మండల కేంద్రానికి కూత వేటు దూరంలోని కానాయపల్లి శివారులో గల శంకరసముద్రం నుంచి కొందరు మట్టి వ్యాపారులు ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా మట్టిని తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రతి రోజు పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నా అధికారులు నిమ్మకునీరెత్తినట్లుగా ఉండడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా మండలంలోని పామాపురం శివారులో గల ఊకచెట్టు వాగు నుంచి కొందరు ట్రాక్టర్ల యజమానులు రాత్రి, పగలు తేడా లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నా రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారు. కొందరు పోలీసులకు, రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చిన స్పందించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రకృతి సంపదను అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

నివాసం.. నరక కూపం

- డబుల్‌బెడ్రూం ఇళ్లలో పరేషాన్
- డ్రైయినేజీలు లేక ఇబ్బందులు
- పునాది నిర్మాణంలో పగుళ్లు
- రూ 8కోట్లు వెచ్చించినా ప్రయోజనం లేదు



ఇళ్ల మధ్య నిలిచిన మురుగు



మదనాపురంలో నిర్మించి డుబుల్ బెడ్‌రూం ఇళ్లు

మదనాపురం: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పేదలకు డబుల్ బెడ్‌రూం ఇల్లు ఇస్తామని ఇచ్చిన వాగ్దానం మేరకు రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక ప్రాంతాల్లో లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లను మంజూరు చేశారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలో రూ.8.40కోట్లు వెచ్చించి 160 ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.. 2017 సంవత్సరంలో అప్పటి మంత్రి కేటీఆర్ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. దాదాపు ఏడేళ్ల పాటు నత్తనడకన ఇళ్ల నిర్మాణం కొనసాగింది. 2023లో మంత్రి హరీష్‌రావు, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి ఇళ్లను ప్రారంభిచారు. మొత్తం 130 ఇళ్లు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేశారు.


మౌలిక వసతులు శూన్యం

ఇళ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించలేదన్న విమర్శలు ఉన్నాయి. పునాదులకు పగుళ్లు వచ్చి, గోడలు నెర్రెలు బారుతున్నాయని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు కనీసం కాలనీలో కనీస మౌలిక వసతులు కూడా లేవని లబ్ధిదారులు వాపోతున్నారు. పెద్ద వర్షం కురిస్తే ఇళ్లలోకి వర్షపు నీరు వస్తుందని ఆవేదన చెందుతున్నారు. డ్రైయినేజీ వ్యవస్థ లేకపోవడంతో రోడ్ల మీద మురుగు నిల్వ ఉండడం ద్వారా దోమల వ్యాప్తి పెరిగి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి డ్రైయినేజీలు, తాగునీరు, సీసీ రోడ్లు, ఇతర మౌలిక వసతులు కల్పించాలని ప్రజలు వారు కోరుతున్నారు.

రాత్రి వేళల్లో పాముల సంచారం

డబుల్ బెడ్‌రూం ఇళ్ల పరిసర ప్రాంతాల్లో రాత్రి వేళ పాములు, విష సర్పాలు సంచరిస్తున్నాయి. నీరు ఆరు బయట నిల్వ ఉండడంతో తేమ కారణంగా పాములు వస్తున్నాయని వారు వాపోతున్నారు. దీంతో బయటికి వెళ్లామన్న భయమేస్తుందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్నిసార్లు ఇళ్లలోకి సైతం విష పురుగులు వస్తున్నాయని చెబుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఖాళీ చేసి ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంటుందని అసహనం వ్యక్తం చేస్తున్నారు.


డ్రైయినేజీ నిర్మించండి



మాకు ప్రభుత్వం ఇల్లు ఇచ్చింది అన్న సంతోషం ఏ మాత్రం లేదు. ఇంటి చుట్టుముట్టు నీరు నిల్వ ఉంటుంది. రాత్రి వేళల్లో పాములు, తేళ్లు వస్తున్నాయి. బిక్కు బిక్కుమంటూ ఇళ్లలో తలదాచుకుంటున్నాం. ఎవరూ పట్టించుకోవడం లేదు. తక్షణమే స్పందించి మురుగు కాల్వలు నిర్మించాలి.

– లక్ష్మి, లబ్ధిదారురాలు, మదనాపురం

బురదతో ఇబ్బందులు



ఒక్కరోజు వర్షం వస్తే చాలు ఇంటి చుట్టు నీరు చేరి బురదమయం అవుతుంది. దీంతో కప్పల అరుపులు వినిపిస్తాయి. డబుల్ బెడ్‌రూం ఇల్లు వచ్చిన సంతోషం లేదు. అధికారులు ఇటువైపు రావడమే మర్చిపోయారు. తక్షణమే స్పందించి మౌలిక వసతులు ఏర్పాటు చేయాలి. సీసీ రోడ్లు, డ్రైయినేజీలు, తాగునీటి వసతిని కల్పించాలి.

– రాజు, లబ్ధిదారుడు

త్వరలో పనులు ప్రారంభిస్తాం

డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల వద్ద మౌలిక వసతులు ఏర్పాటు కోసం రూ. 35 లక్షల రూపాయలు ఉన్నాయి. సీసీ రోడ్లు సెప్టిక్ ట్యాంకు మురుగు కాలువల పనులు చేపడతాము. మరో రూ. 20 లక్షల రూపాయల ప్రతిపాదనను పంపాము. ఉన్నతాధికారుల నుంచి మంజూరు వచ్చిన వెంటనే ప్రారంభిస్తాము లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా చూస్తాం.

– నరేష్‌కుమార్, పంచాయతీ రాజ్ ఏఈ, మదనాపురం

చెట్లు తొలగించినా.. పట్టించుకోని అధికారులు

మానవపాడు: గత తెలంగాణ ప్రభుత్వ హయాంలో హరితహారంలో భాగంగా మొక్కల పెంపకం నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాలలో మొక్కలు నాటించారు. మండలంలోని గోకులపాడు శివారు ప్రాంతంలో రోడ్ల వెంబడి నాటిన మొక్కలను తొలగించారు. రోడ్ల వెంట చెట్లను నరుకుతున్నా పట్టించుకునే వారు కరువైయ్యారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హరిత హారంలో భాగంగా వేలకు వేలు ఖర్చు చేసి నాటిన మొక్కలను నాటితే వాటిని నరికివేసి ప్రజాధనం వృథా చేస్తున్నా, పట్టించుకునే నాథుడు కరువయ్యారు. హరిత హారంలో భాగంగా మొక్కలను పెంచుతున్నారు. ఆహ్లాదకరమైన వాతావరణం, కాలుష్యం చెడిపోకుండా మొక్కల పెంపకం చేపడుతున్నారు. ఇప్పటికైనా మొక్కల పెంపకంలో అధికారులు నిర్లక్ష్యం వీడి చెట్లను నరికివేతను అరికట్టాలని ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.